



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూన్ 12, 2026 | సంపుటి : 2 | సంచిక : 240 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

## విద్య,వైద్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యం

- సామాజిక వెనకబాటుకు విద్యలేమి కారణంగా తేలింది
- తెలంగాణ అభివృద్ధి నమూనాపై ప్రత్యేకంగా ప్రస్తావన
- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ ప్రసంగం
- తెలంణాకు ఐఐఎం అసవరాన్ని గుర్తించాలని వినతి
- ప్రధాని మోడీతో ప్రత్యేక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ

### వెనకబాటు నిర్మూలనకే యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం

**న్యూఢిల్లీ,జూన్11:**
దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డబ్బు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో



'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు.

2లో..

# అద్దె భవనాలకు ఇక స్వస్తి

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిధిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు.

2 లో

# ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

- భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రవాణ్యామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**సిద్దిపేట,జూన్11**
రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామన్నారు. పుష్కరాలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు.
నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.






2లో..

# సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

- దొంగ ఓట్లు తొలగిస్తే భయపడాలా
- విపక్షాల తీరుపై మండిపడ్డ బిజెపి నేత రామచంద్రరావు

**సిద్దిపేట,జూన్11**
సర్ ప్రక్రియపై బురదజల్లడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నామయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. ఎందుకంత భయమో చెప్పాలన్నారు. దొంగోట్లను తొలగించడం ఎన్నిక లసంఘం విధి అన్నారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు భాజపా మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు భాజపాపై బురదజల్లే ప్రయత్నం



చేస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు.

2 లో

## కోర్టు ఉత్తర్వులున్నా మెమో ఎందుకిస్తున్నారు?

**హైదరాబాద్:**




సినిమా టికెట్ల పెంపుపై తాము ఉత్తర్వులు జారీ చేసినా ఎందుకు ధరలు పెంచుతూ మెమో జారీ చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దాదాపు ఆరేడు మెమోలు జారీ చేశారని, సదరు అధికారి ఆంతర్యం ఏంటని అడిగారు.

2లో..

## ప్రకృతి పంటలే

# మన ఆరోగ్యానికి రక్ష

- రసాయన పంటలతో రకరకాల రోగాలు
- రైతు సమ్మేళనంలో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్,జూన్11 :**
దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రసాయన ఎరువులతో పండించిన ఆహారం ప్రాణాలకు చేటుగా మారిందన్నారు. ప్రకృతి పంటలను పపండించి తింటేనే మన ఆరోగ్యానికి రక్ష అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో పాలు తాగి 3 రోజులు ఆసుపత్రి పాలయ్యా. 20 ఏళ్లలో ఎప్పుడూ నాకు జ్వరం రాలేదు.



2లో..

### కవిత 'తెలంగాణ రక్షణ సేన'పై

# బీఆర్ఎస్ ఫిర్యాదు

- కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుపై వివాదం.
- కేంద్ర ఎన్నికల సంఘానికి ఇప్పటికే 700 ఫిర్యాదులు.
- తెలంగాణ రక్షణ సేన పేరుపై బీఆర్ఎస్ అభ్యంతరం.
- తెలంగాణ ఉద్యమంతో ఆ పేరు ముడిపడి ఉందన్న బీఆర్ఎస్.
- ఆ పేరును ఇతరులకు కేటాయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి.
- మహారాష్ట్రకు చెందిన మరో సంస్థ కూడా అదే పేరుకు దరఖాస్తు.

**హైదరాబాద్:**
ఎమ్మెల్సీ కవిత రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' కు ఊహించని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే కవిత పార్టీ టీఆర్ఎస్‌పై ఈసీఐకి దాదాపు 700 ఫిర్యాదులు అందడం రాజకీయ వర్గాల్లో చర్చాంశనీయంగా మారింది. ఈ నేపథ్యంలో కవిత రాజకీయ పార్టీ పేరుపై భారత రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 'టీఆర్ఎస్' అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది.




2లో..

# ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం

- అక్కడి భూములు ఫార్మా కోసం సేకరించాం
- వాటిని మార్పు చేస్తే చట్టం ఒప్పుకోదు

- జర్నలిస్టులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలి
- మీనాక్షనటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ వెన్నుపోటు
- వందకోట్ల ప్రజాధనంతో సిఎం సొంతిల్లు నిర్మాణం
- మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శలు



**హైదరాబాద్,జూన్11:**
ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదన్నారు. ఫార్మాసిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా అని అన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా అన్నారు. . ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరని హరీశ్‌రావు ప్రశ్నించారు.

2లో..

## మోడీ పాలనలో సామాన్యుల

# బతుకు దుర్భరం

- మీనాక్షినటరాజన్ పై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**న్యూఢిల్లీ,జూన్11:**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో బతుకుడే కష్టంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతూ పోతున్నాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) ఢిల్లీ వేదికగా మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.



మిగతాద్ది 2 లో

# అద్దె భవనాలకు ఇక స్వస్తి

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థాలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అ÷-దదె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ లలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు.

## ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిగా దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరించడం వెనుక రాష్ట్రంలోని ఆ పార్టీ నేత హస్తం ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ఆమెకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఉన్నట్లు తెలంగాణ నుంచే తమకు సమచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే చెప్పారని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును బీజేపీ మంత్రికి లీక్ చేసింది ఎవరని.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ కేసును లీక్ చేసింది ఎవరనే దానిపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్), జ్యుడీషియరీ ఎంక్వైరీ వేస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చెప్పిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వలేదని విమర్శించారు. అందుకే ఆ వ్యక్తి మధ్యప్రదేశ్ మంత్రికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడు ఉన్నారని చెప్పారు. రూ. 100 కోట్లతో తన నివాసం సమీపంలో బోధి పెవిలియన్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం నిర్మిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ ఇంటి నిర్మాణం కోసం పదుల సార్లు సీఎం అక్కడికి వెళ్లారని చెప్పారు. ఇనుప కంచెలకి రూ.17 కోట్లు.. రక్షణ కోసం, ఫుట్ బాల్ ఆడేందుకు రూ.10 కోట్లు కేటాయించారన్నారు. అలాగే కౌన్సిల్‌లో సీఎం ఛాంబర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. పని చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రజాధనం వృధా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 7 కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే రూ.70 కోట్ల పైన ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నగదు లేదు కానీ సీఎం సోకులకు రూ. వందల కోట్లు ఖర్చు పెడతారా? అంటూ హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి
## రంగోలి మహిళలకు బహుమతి ప్రదానంలో పొన్నం మంజుల

మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో జనవరిలో జరిగిన రంగోలి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కుటీర పరిశ్రమలను నెలకొల్పి ఉపాధిని పొందే అవకాశం పొందవచ్చని అన్నారు. ప్రభుత్వం ద్వారా మహిళలకు రాయితీతో కూడిన రుణాలను అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఐకెపి సంఘాల ద్వారా పొదుపులు చేసుకొని వడ్డీ లేని రుణాలను పొందవచ్చనీ అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దార్ ముద్దసాని రమేష్, సర్పంచ్ ఆకవరం భవాని, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్, సెర్ఫ్ ఏపిఎం రజిత, విజయలక్ష్మి మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు రజిత, అరుణ, స్వప్న, సీసీలు రాజేశం, సత్యనారాయణ, వెంకటేష్, రమేష్, వీవోఏలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభించిన బాజిరెడ్డి

బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలో గురువారం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ కార్యక్రమానికి సభ్యత నమోదు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి వీజీ గౌడ్, బాన్సువాడ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి తోట ఆగయ్య పాల్గొన్నారు. కాగా రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు సంబంధించిన గులాబీ పార్టీ కార్యకర్తలతో ఈ సమావేశం నిర్వహించారు.

## టూవీలర్‌ను ఢీకొన్న ట్యాంకర్
## ఇద్దరికి తీవ్ర గాయాలు

ట్యాంకర్ బైక్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సిరికొండ మండల కేంద్రంలోని హుస్సేన్ నగర్ వెళ్లే దారిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిరికొండ వైపు నుంచి వస్తున్న ట్యాంకర్ తుంపల్లి వైపు నుండి బైక్ పై సిరికొండ వెళ్తున్న తూంపల్లి గ్రామానికి చెందిన సాయిలు, అశోక్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలోబైక్‌పై ఉన్న సాయిలు, అశోక్ కింద పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారికి చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

## రొట్టెల పండుగకు భారీగా ఏర్పాట్లు
## మంత్రి పి. నారాయణ వెల్లడి

జిల్లాలోని బారా షహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. పండుగ సందర్భంగా ఏర్పాట్లపై గురువారం నెల్లూరులో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు బారా షహీద్ దర్గాలో రొ÷-టటెల పండగ జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఈ పండగకు దేశ విదేశాల నుంచి 16 లక్షల నుంచి 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈ రొ÷-టటెల పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. బారా షహీద్ దర్గాకు 415 సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. రొ÷-టటెలు పట్టుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారని చెప్పారు. అందుకే ప్రతీ ఏడాది భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతోందన్నారు.
క్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. అలాగే సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24వ తేదీ లోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ ఆఫీసర్‌ను తొలగించాలంటూ గిరిజనలు ధర్నా

కొమురం భీం జిల్లా జైనురు మండల కేంద్రంలోని ఎస్బీఐ ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదివాసి సంఘాల సార్ మేడిలు గురువారం బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్లవాయి సార్ మేడి గీడమ్ గణపత్ మాట్లాడుతూ గత ఆరునెలలుగా గిరిజన రైతులకు క్రాప్ లోన్ల విషయంలో స్థానిక బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపించారు. వివిధ కారణాలను సాకుగా చూపిస్తూ క్రాప్‌లోన్లను అడ్డుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సార్ మేడిలు ఆత్రం అనంతరావు, ఆదివాసి సంఘాల నాయకులు మేశ్రం సేకు, కొడప ఆనందరావు, మడవి నాగరావ్, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో నిరుద్యోగులకు శిక్షణ
## 3 నెలలపాటు కార్పోరేట్ స్థాయి ఉచిత శిక్షణ

రామగుండం నియోజక వర్గ నిరుద్యోగులకు ఒకే చోట ఉచిత శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ లో ని పీజేఆర్ సంస్థ ముందుకు వచ్చిందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. నగర పాలక కార్యాలయంలోని ఆయన చాంబర్ లోని గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, ముఖ్యంగా పోలీస్ ఉద్యోగాలు సాధించే లక్ష్యంగా ఎదురుచూస్తున్న నియోజక వర్గంలోని యువతీ యువకులకు ఒకే చోట 3 నెలల పాటు కార్పొరేట్ స్థాయి ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పీజేఆర్ సంస్థ నిర్వాహకుడు పీ.జగదీశ్వర్ రెడ్డి ముందుకు వచ్చారనీ, మున్సిపల్, సింగరేణి సహకారంతో స్థానిక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, సింగరేణి పాఠశాలలో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మున్సిపల్ ఆఫీసులో శుక్రవారం నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక కౌంటర్ తెరచి ఉంటుందనీ, ఆసక్తి గల నిరుద్యోగులు దరఖాస్తులు పూర్తి చేయాలని తెలిపారు. 3 నెలల పాటు జరిగే శిక్షణలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. కోడింగ్ విధానంలో పరీక్ష కూడా ఉంటుందన్నారు. నిష్ణాతులైన 10 మంది శిక్షకులచే కోచింగ్ ఉంటుందన్నారు. గ్రూప్, ఫారెస్టు, పోలీస్, టెట్, తదితర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే లక్ష్యంతో నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండే ఇక్కడే కార్పొరేట్ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు 47 నియోజక వర్గాల్లో నిరుపేద నిరుద్యోగులకు కార్పొరేట్ తరహాలో ఉచితంగా శిక్షణ ఇచ్చామనీ, 13 వేల మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ముఖ్యంగా 20వేల మంది పోలీసులను తయారు చేయాలన్నదే తమ సంస్థ లక్ష్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు రామగుండం నియోజక వర్గ నిరుద్యోగులకు కూడా 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఎల్‌నిలో ప్రభావంతో వర్షాభవం
## ఆరుతడి పంటలు వేసుకుంటే మంచిది

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అధిక నీరు అవసరం ఉన్న వరి, మిరప వంటి పంటలకు బదులుగా నూనె గింజలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ రైతులకు సూచించారు. గురువారం సింగరేణి మండల పరిధిలోని పలు విత్తనాల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. అనంతరం సీతారాంపురం, అప్పాయిగూడెం గ్రామాల్లో రైతులతో సమావేశమై వ్యవసాయ సూచనలు చేశారు. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తుకోవాలని, లైసెన్స్ పొందిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే దిశగా యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డీఏపీకి ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ వినియోగించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భట్టు అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) బి.నరేశ్, ఎస్‌కే.మున్నీ పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

మొదటిపేజీ తరువాయి

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న భాజపా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో రామచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్టాల్లో్ర ఎస్‌ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్‌ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు భాజపాను విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్‌ఐఆర్ పక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్‌ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

## ప్రకృతి పంటలే
## మన ఆరోగ్యానికి రక్ష

మొదటిపేజీ తరువాయి

బీపీ, షుగర్ లేదు. నరేంద్ర మోదీయే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం.. భూమి అంతా కెమికల్స్‌తో నిండిపోయింది. రోగానికి కారకులం మనమే.. నివారించగలిగేది మనమే. ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బ్జడెట్‌లో రూ.2,400 కోట్లు కేటాయించింది. ప్రకృతి వ్యవసాయం చేస్తే రెండు.. మూడేళ్లు లాభాలు రాకపోయినా, ఆ తర్వాత రైతులు కోటీశ్వరులవుతారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రైతులు గమనించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు. బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు యూరియాకు ఖర్చు చేస్తున్నాం. రూ.1.20 లక్షల కోట్ల సొమ్ము విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరం. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.. ప్రకృతి వ్యవసాయంతో వచ్చిన పంటకు మద్దతు ధర ఇచ్చేలా చూస్తాం. మన దేశ సొమ్మును విదేశాలకు పంపి ఆయిల్, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులను కొంటున్నాం. అందుకే మేక్ ఇన్ ఇండియాతో స్వదేశీ ఉత్పత్తులను మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్రమంత్రి తెలిపారు.

## కవిత 'తెలంగాణ రక్షణ సేన'పై
## బీఆర్ఎస్ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి

కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' కూడా 'టీఆర్ఎస్' అనే పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది.

## మోడీ పాలనలో సామాన్యుల
## బతుకు దుర్భరం

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళా అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని చెప్పుకొచ్చారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

మొదటిపేజీ తరువాయి

యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ 6 ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేంద్రం ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రోఫేజ్-2, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సమావేశానంతరం సిఎం ప్రధాని మోడీతో ప్రత్యేకంగా భేటీ
అయ్యారు. తెలంగాణకు సంబంధించి వివిధ ప్రాజెక్టుల అనుమతులపై చర్చించారు. మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో రెండో దశ తదితర ప్రాజెక్టులపై చర్చించారు.

## కోర్టు ఉత్తర్వులున్నా మెమో ఎందుకిస్తున్నారు?

మొదటిపేజీ తరువాయి

ధరలు పెంచబోమని హామీ ఇచ్చిన తర్వాత కూడా తదుపరి చిత్రాలకు అదే చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో తదుపరి విచారణ ఈ నెల 15కు వాయిదా వేసింది.
పెద్ది సినిమాకు టికెట్ల ధరలను పెంచుతూ ఇచ్చిన మెమోను సవాల్ చేస్తూ డి.చంద్రబాబు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఉత్తర్వులున్నా ధిక్కరిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి మెమో జారీ చేశారన్నారు. పదేపదే కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నందున సదరు అధికారికి రూ.10 లక్షల జరిమానా విధించి లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. విచారణ వాయిదా వేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూన్ 12, 2026

# కమ్యూనిస్టులు తెలంగాణ వాదులా!

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**▪ తెలంగాణ ను ప్రత్యేక దేశం చేయాలని కుట్ర చేసినవారు ,పార్లమెంట్ లో ప్రత్యేక తెలంగాణ బిల్లును వ్యతిరేకించిన వారు తెలంగాణ వాదులు ఎలా అవుతారు?**

భారత సైన్యం పై పోరాటం చేయడానికి రష్యా సహకారం కోరిన వారు తెలంగాణ వాదులు ఎలా అవుతారు? వీళ్ళా జెన్ జి తరాన్ని ప్రభావితం చేయగలిగేది.

**▪ ఇది జెన్ జి తరం..జెన్ జి అంటే పులులు సింహాలు..**

**జెన్ జి తరాన్ని బొద్దింకలు అంటున్న వారెవరు?**

**▪ ఇలా అంటున్నది కమ్యూనిస్టులు**

**▪ కమ్యూనిస్టులే నిజమైన బొద్దింకలు.**

మురికిలో బతికేవి బొద్దింకలు..
దేశ వ్యతిరేక మురికిని వెదజల్లే వారు కమ్యూనిస్టులు.

ఇది అపవాదు కాదు. చరిత్ర చెబుతున్న నిజం. కమ్యూనిస్టులు త్యాగ జీవులు,పోరాట యోధులు,సమాజ హితైశులు అని మనం విన్నాం.

**దేశ హితం కాని త్యాగాలు,పోరాటాలు, విశ్వాసాలు,సిద్ధాంతాలు చివరికి దేశ ద్రోహానికి దారితీస్తాయి**

విదేశీ భావజాలం తో కూడిన కమ్యూనిస్టుల నిజ స్వరూపం ఇప్పుడు వాళ్లకు వాళ్ళే బయట పెట్టుకున్నారు.అందుకే భారత ప్రజలకు దూరమయ్యారు.
మన దేశంలో ముఖ్యంగా మన తెలంగాణలో కమ్యూనిస్టులు ఇప్పుడు అప్రాధాన్య స్థితికి చేరుకున్నారు.

**▪ మార్వాడీ గోబ్యాక్,గుజరాతీ గోబ్యాక్,ఆంధ్రా గో బ్యాక్ అంటూ అరిగిపోయిన రికార్డులను వినిపిస్తున్న కమ్యూనిస్టుల చరిత్ర అసలు రూపం ఎప్పుడో బయట పడింది.**

మీడియా రంగంలో ఉన్న కమ్యూనిస్టు శక్తుల ప్రభావంతో ఇప్పటివరకు కుంటుతూ తన గొప్పదనాన్ని ప్రచారం చేసుకుంటూ కమ్యూనిస్టులు కాలం గడుపుతూ వచ్చారు.
కానీ ఈ మధ్య అర్థం పర్థం లేని గొడవలు సృష్టిస్తూ కమ్యూనిస్ట్ వ్యక్తులు తెలంగాణలో అలజడి రేపుతూ ఉన్న పరువు తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ కమ్యూనిస్టుల చరిత్ర గురించి తాజా చర్చలు నడుస్తున్నాయి నైజాం వ్యతిరేక పోరాట చరిత్రను హైజాక్ చేసి ఇన్నాళ్ళు బతికిన కమ్యూనిస్టుల స్వార్థ చరిత్ర తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది.నైజాం వ్యతిరేక తెలంగాణ పోరాటం లో కమ్యూనిస్టుల పాత్ర ఏమిటి?

**▪ నిజాం నవాబు ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నైజాం రాజ్యంలో 1946 లో ప్రజా పోరాటం ప్రారంభమైంది.ఇది ప్రజల స్వచ్ఛంద తిరుగుబాటు.ఎందుకు ప్రారంభమైంది.**

**▪ భూస్వామ్య వ్యవస్థ మరియు దొరల అరాచకాలు**

నిజాం రాజ్యంలో భూములు ఎక్కువగా నిజాం సొంత జాగీర్లు (సర్ఫేఖాస్), దొరలు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీల ఆధీనంలో ఉండేవి. పేద రైతుల, కౌలుదారుల భూములను అక్రమంగా లాక్కోవడం సాధారణంగా జరిగేది. ఉదాహరణకు, పాలకుర్తి ఐలమ్మ (చాకలి ఐలమ్మ) పంట భూమిని విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి గుండాలు అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడం పెద్ద ఎత్తున తిరుగుబాటుకు దారితీసింది.

**▪ వెట్టి చాకిరీ**

సమాజంలోని వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు ఏ విధమైన వేతనం లేకుండా దొరల ఇళ్లలో, పొలాల్లో రాత్రింబగళ్లు బానిసల్లా వెట్టి చాకిరీ చేయాల్సి వచ్చేది. సామాన్య ప్రజలు భూస్వాములను చూసినప్పుడు చెప్పులు చేత పట్టుకుని, వారి కాళ్లపై పడి "బాంచన్ నీ కాల్మొక్తా" అని వేడుకోవాల్సిన బానిసత్వ సంస్కృతి ఉండేది.

**▪ తీవ్రమైన పన్నుల దోపిడీ**

రైతులు, సామాన్యులపై నిజాం అధికారులు, భూస్వాములు దాదాపు 82 రకాల అక్రమ పన్నులను మోపేవారు. పంటలు పండకపోయినా బలవంతంగా లేవీ (ధాన్యం) వసూలు చేసేవారు. అప్పుల పేరుతో వడ్డీల మీద వడ్డీలు (నాగు వడ్డీ) వేసి తరతరాలుగా రైతులను అప్పుల ఊబిలో నొక్కేవారు.

**▪ భాషా, సాంస్కృతిక అణచివేత**

తెలంగాణలో అత్యధిక శాతం ప్రజలు తెలుగు మాట్లాడేవారైనప్పటికీ, నిజాం ప్రభుత్వం ఉర్దూను అధికారిక మరియు విద్యా భాషగా బలవంతంగా రుద్దింది. తెలుగు పాఠశాలల స్థాపనకు, గ్రంథాలయాల నిర్వహణకు ఆంక్షలు విధించారు. దీనిని నిరసిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఆంధ్ర మహాసభ ప్రారంభమైంది.

**▪ రజాకార్ల రాక్షసకాండ**

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంచాలని నిజాం భావించాడు.నిజాంకు మద్దతుగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని ప్రైవేట్ సైన్యం రజాకార్లు గ్రామాల్లో పడి ఇళ్లను తగులబెట్టడం, ఆస్తులను లూటీ చేయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం వంటి ఘోరమైన మతోన్మాద అరాచకాలకు పాల్పడ్డారు.

**▪ గిరిజన హక్కుల కాలరాశారు**

నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటవీ చట్టాల వల్ల గిరిజనులు శతాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములను కోల్పోయారు. దీనికి వ్యతిరేకంగా కొమురం భీమ్ నాయకత్వంలో గిరిజనులు జల్, జంగల్, జమీన్ నినాదం తో ఆయుధాలు పట్టారు.

**▪ ఉద్యమానికి తక్షణ కారణం**

1946 జూలై 4 న నల్గొండ జిల్లా ప్రస్తుత జనగామ జిల్లాలోని కడవెండి గ్రామంలో విస్నూరు దేశ్‌ముఖ్ రౌడీలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమరయ్య మరణించాడు. ఈ మరణం తెలంగాణ ప్రజల్లో లావా లాంటి ఆగ్రహాన్ని రగిల్చింది.

ప్రజలే సైన్యంగా,నాయకులుగా నైజాం కు వ్యతిరేకంగా ప్రతిఘటన ప్రారంభించారు.




కాలం చెల్లిన కమ్యూనిజం.. తెలంగాణలో ఉనికి కోల్పోయిన కమ్యూనిస్టులు...

**ఈ పరిణామాలలో ఎక్కడా కమ్యూనిజం లేదు.కమ్యూనిస్టులు లేరు.**

ప్రజలు ఎక్కడికక్కడ చేతికి దొరికిన పలుగు పార కొడవలి గొడ్డలి పట్టుకుని రజాకార్ల కళ్ళల్లో కారం కొట్టి సాంప్రదాయ పద్ధతిలో పోరాటం జరిపారు.

**▪ తెలంగాణ విముక్తి పోరాటంలో కమ్యూనిస్టులు ఎప్పుడు ప్రవేశించారు**

కమ్యూనిస్టులు ఒకేసారి కాకుండా, దశలవారీగా తెలంగాణ పోరాటం లో వ్యూహాత్మకంగా ప్రవేశించారు.

1930ల నాటికే పొరుగున ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ (కోస్తాంధ్రా) ప్రాంతంలో కమ్యూనిస్టుల ప్రభావం ఉండేది. అక్కడి నుండి ఖమ్మం, వరంగల్, నల్గొండ సరిహద్దు ప్రాంతాల ద్వారా కమ్యూనిజం సిద్ధాంతాలు హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించాయి.
తెలంగాణలో అప్పటికే సాంస్కృతిక, భాషా చైతన్యం కోసం పనిచేస్తున్న ఆంధ్ర మహాసభ (AMS) లోకి కమ్యూనిస్టు భావజాలం గల యువకులు ప్రవేశించారు.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1946--1951 సం.ల మధ్య నడిచింది. అప్పటి హైదరాబాద్ సంస్థాన సరిహద్దుల వెలుపల (కోస్తాంధ్రా, రాయలసీమ) నుండి వచ్చి, ఉద్యమానికి వ్యూహాత్మక నాయకత్వం మరియు ఆయుధ శిక్షణ అందించిన ప్రముఖ ఆంధ్ర నాయకులు.

**పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లాకు చెందిన వాడు. ఈయన కమ్యూనిస్టు పార్టీ తరపున ఈ పోరాటానికి అగ్రగామిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా నిలిచారు.**

**చంద్ర రాజేశ్వరరావు కృష్ణా జిల్లాకు చెందిన వారు. వీరు తెలంగాణ అడవుల్లో గెరిల్లా దళాలకు స్వయంగా ఆయుధ శిక్షణ ఇచ్చారు.**

**మాకినేని బసవపున్నయ్య గుంటూరు జిల్లాకు చెందిన వారు. ఈయన సాయుధ విప్లవ వ్యూహరచనలో కీలక పాత్ర పోషించారు.**

**డా. పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (డాక్టర్ రామ్) నెల్లూరుకు చెందిన వారు. ఈ వైద్యుడు అడవుల్లోకి వెళ్లి గాయపడిన తెలంగాణ పోరాట యోధులకు రహస్యంగా చికిత్స అందించారు.**

**నండూరి ప్రసాదరావు కృష్ణా జిల్లాకు చెందిన వారు. ఈయన సరిహద్దు ప్రాంతాల ద్వారా తెలంగాణ విప్లవకారులను సమూహపరిచారు.**

**కంభంపాటి సత్యనారాయణ గారు ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక, ప్రచార మద్దతును అందించారు.**

ఈ ఆంధ్రా నాయకుల ప్రభావం తో భువనగిరి (నల్గొండ) ప్రాంతానికి చెందిన రావి నారాయణరెడ్డి తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడిగా నిలిచారు.
ఆంధ్ర నాయకులతో కలిసి పని చేస్తూ, ఆంధ్రమహాసభను కమ్యూనిస్టు భావజాలం వైపు నడిపించారు.
కరీంనగర్ జిల్లాకు చెందిన బద్దం నారాయణ రెడ్డి నిజాం సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.
నల్గొండ జిల్లాకు చెందిన దేవులపల్లి వెంకటేశ్వరరావు గెరిల్లా యుద్ధ వ్యూహాలపై 'తెలంగాణ జాతీయ విప్లవ పంథా'ను రూపొందించడంలో పుచ్చలపల్లి సుందరయ్యతో కలిసి పనిచేశారు.

**▪ క్షేత్ర స్థాయిలో ఈ సాయుధ పోరాటానికి భీమిరెడ్డి నరసింహారెడ్డి,నల్లా నరసింహులు,**

ఆరుట్ల రామచంద్రా రెడ్డి,అనభేరి ప్రభాకర్ రావు,చాకలి ఐలమ్మ,దొడ్డి కొమురయ్య లతో పాటు ఒక ఉప్పెనగా యువకులు ప్రజలు పోరాటంలోనికి దూకారు. ఇది స్వచ్ఛందంగా జరిగిన నిజాం వ్యతిరేక పోరాటం.

**▪ ఇలా తెలంగాణ మెల్ల మెల్లగా ఆంధ్రా నాయకుల చేతిలో చిక్కింది**

ఈ కమ్యూనిస్టు భావజాలం మెల్లగా తెలంగాణను గుప్పిట పట్టి ప్రత్యేక కమ్యూనిస్ట్ దేశంగా మార్చుకోవాలని ప్రయత్నం జరిగింది.
1948 సెప్టెంబరులో 'ఆపరేషన్ పోలో' పోలీస్ యాక్షన్ ద్వారా నిజాం రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత కూడా కమ్యూనిస్టులు తమ సాయుధ పోరాటాన్ని 1951 అక్టోబరు వరకు దాదాపు మూడేళ్లు కొనసాగించారు.

**▪ కమ్యూనిస్టుల ఈ పోరాటం ఎందుకు?**

నైజాం స్టేట్ భారత దేశంలో కలవడం ఇష్టం లేని కమ్యూనిస్టులు తమ సాయుధ మదం తో భారత మిలిటరీ బలగాలతో పోరాటం కొనసాగించి అర్థం పర్థం లేని వాదనలు వినిపించారు.

నాటి కమ్యూనిస్టు పార్టీ (CPI) బి.టి. రణదివె నాయకత్వంలో జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వాన్ని "బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వంగా" మరియు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి తొత్తుగా భావించింది. భారతదేశానికి వచ్చిన స్వాతంత్ర్యం నిజమైనది కాదని ..యే ఆజాదీ ఝూఠీ హై.. అంటూ తెలంగాణ తరహా విప్లవాన్ని దేశవ్యాప్తం చేయాలని వారు వ్యూహం రచించారు.

నిజాం లొంగిపోయిన తర్వాత కమ్యూనిస్టులు నైజాం రాజ్యాన్ని స్వతంత్ర దేశంగా మార్చి తాము పాలించాలని భారత సైన్యంతో పోరాటం కొనసాగించారు. భారత సైన్యం రజాకార్లను అణచడంతో పాటు, కమ్యూనిస్టులను కూడా కమ్యూనిస్టు గ్రామ సంఘాలను లక్ష్యంగా చేసుకుంది. భారత మిలిటరీ దాడుల నుండి తమను తాము రక్షించుకోవడానికి కమ్యూనిస్ట్ దళాలు అడవుల్లోకి వెళ్లి గెరిల్లా పోరాటాన్ని కొనసాగాంచారు.

**▪ తెలంగాణ ప్రాంతంలో తాము నెలకొల్పిన 'గ్రామ రాజ్యాలు' (సమాంతర పాలన) మరియు ప్రజాధికారాన్ని వదులుకోవడానికి స్థానిక కమ్యూనిస్టు నాయకత్వం అప్పుడు సిద్ధంగా లేదు.**

**▪ రష్యా విప్లవ విజయం తర్వాత ప్రపంచంలో కమ్యూనిజం గాలి వీయడం ప్రారంభమయ్యింది.ఆ రష్యా భక్తులు గా మారిన భారత కమ్యూనిస్టులు నిజాం రాజ్యాన్ని స్వతంత్రం చేసి ప్రత్యేక కమ్యూనిస్ట్ రాజ్యంగా మార్చడంలో సహాయం చేయవలసిందిగా కోరుతూ మాకినేని బసవ పున్నయ్య,అజయ్ ఘోష్, శ్రీపాద అమృత డాంగే, చంద్ర జేశ్వరరావు లతో కూడిన ఒక బృందం ఫిబ్రవరి 1951లో రష్యా కు సోవియట్ యూనియన్ కు వెళ్ళి అధినేత జోసెఫ్ స్టాలిన్‌ను కలిసి సైనిక సహాయం కోరింది.**

"ఈ సుదీర్ఘ చర్చల్లో జోసెఫ్ స్టాలిన్ భారతదేశ భౌగోళిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు. రష్యా లేదా చైనా తరహా సాయుధ విప్లవాలు చేయడానికి భారతదేశంలో ఇంకా పరిస్థితులు పరిపక్వం కాలేదని, నైజాం రాజ్యానికి కనీసం సముద్రం కూడా లేదని అన్నారు. భారత భూభాగం మధ్యలో ఉన్నందున సైనిక సహాయం చేయడం కూడా కుదరదని స్టాలిన్ అన్నాడు."

**▪ సైనిక అణచివేత ఎక్కువగా ఉన్నందున తెలంగాణలో సాయుధ పోరాటాన్ని విరమించుకుని ప్రజాస్వామ్య పంథాలో ఎన్నికల్లో పాల్గొనడమే శ్రేయస్కరమని స్టాలిన్ ఈ ప్రతినిధి బృందానికి సూచించారు. ఈ సలహా తర్వాత అంతర్గత చర్చల అనంతరం, అక్టోబర్ 1951లో కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా ఉపసంహరించుకున్నారు.**

స్టాలిన్ సలహా, మరియు దేశంలో జరగబోయే 1952 మొదటి సాధారణ ఎన్నికలలో పాల్గొనాలని నిర్ణయించుకోవడం వల్ల, కమ్యూనిస్టు పార్టీ 1951 అక్టోబరు 21న సాయుధ పోరాటాన్ని అధికారికంగా విరమించుకుంది.
తర్వాత కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొనడానికి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ పార్టీ పెట్టుకుని గణనీయ స్థానాలు సాధించారు. కానీ భారత ప్రజల తెలంగాణ ప్రజల సంస్కృతికి ఆత్మకు దూరమై తమ ప్రభావాన్ని కోల్పోతూ వచ్చారు.ఇప్పుడు అసలు ఉనికి కూడా కోల్పోయారు.

**▪ కమ్యూనిస్టుల ఈ స్వార్థ వైఖరి కేవలం తెలంగాణ వ్యతిరేకం మాత్రమే కాదు.దేశ వ్యతిరేకం.దేశ ద్రోహం కూడా.**

కాలం చెల్లిన కమ్యూనిజం అంతర్జాతీయ సిద్ధాంతం అని ఊదర గొడుతుంటారు.వారి సిద్ధాంతం ఏదైనా కానీ..కమ్యూనిస్టులు భారత దేశ భక్తులు మాత్రం కాదు.

# పరకాలలో అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ క్షేత్రస్థాయి పరిశీలన

**▪ మున్సిపల్ కార్యాలయం, దామెర చెరువు అభివృద్ధి పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం సందర్శన**

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, జూన్ 11**

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరకాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఇతర అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సేవల నిర్వహణను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన



మొక్కల నర్సరీని పరిశీలించి పచ్చదనం పెంపొందించే చర్యలను పరిశీలించారు. అదేవిధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దామెర చెరువు కట్ట బండ్, నాలా, కాలువ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. తదుపరి అసంపూర్తిగా ఉన్న



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, నిర్మాణ పనుల స్థితిగతులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అవార్డుకు ఎంపికైన బండి మణెమ్మ కు ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిది కాజీపేట, జూన్ 11**

అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో కాజీపేటకు చెందిన ప్రముఖ కమ్యూనిటీ నాయకురాలు బండి మణెమ్మ కు ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో దక్షిణాసియా దేశాలలో నీరు, పారిశుధ్యం పరిశుభ్రత రంగాలలో పనిచేస్తున్న ప్రముఖ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సదస్సుకు తెలంగాణా రాష్ట్రం తరుపున వరంగల్ నుండి ఫ్రెషవాటర్ యాక్షన్ నెట్వర్క్ సౌత్ ఆసియ (ఎఫ్.ఎ.ఎన్.ఎస్.ఎ) ఆధ్వర్యంలో 2026 జూన్ 12,13 తేదీలలో నేపాల్ దేశ రాజధాని ఖాట్మండులో ని హోటల్ మల్లాలో నిర్వహించనున్న గ్రాస్ రూట్స్ అసెంబ్లీ 2026 సమావేశంలో విశ్లేషణ వక్తగా పాల్గొనడానికి ఆమెకు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా చిన్న నాటి మిత్రులు బండి మణెమ్మ ని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మణెమ్మ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ డీ-స్లడ్జింగ్ అంశంలో కమ్యూనిటీ భాగస్వామ్యంతో సాధించిన అనుభవాలను దక్షిణాసియా దేశాల ప్రతినిధులతో విశ్లేషించడానికి దక్కిన ఈ అరుదైన గౌరవం నాకు లభించినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ మిత్రులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికపై వరంగల్ ప్రాంతానికి చెందిన బండి మణెమ్మ తెలంగాణ రాష్ట్రం నుండి ప్రధాన ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యం లో విజయవంతంగా ప్రసంగించి విశేష గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పులపా శ్రీనివాస్, ట్రై సిటి ఆటో డ్రైవర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు సిలువేరు విజయ భాస్కర్, తేజోమయి మాల కుల సంఘం ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్, మరియు సమాచార్ పత్రిక విలేఖరి దుప్పటి శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కాంగ్రెస్ సర్కార్ ఆర్థిక దాడి!

- తరుగు, రవాణా పేరుతో రూ.1,200 కోట్ల భారం
- రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేతకు కుట్ర
- వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించి రైతులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి
- టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత







కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 11

రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. నల్గొండలో రైతు సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆమె, రైతుల సంక్షేమం కంటే వారిపై అదనపు భారాలు మోపడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలులో ప్రభుత్వం విఫలమైందని, పైగా ధాన్యం కొనుగోళ్లలో తరుగు, రవాణా చార్జీల పేరుతో రైతుల వద్ద నుంచి సుమారు రూ.1,200 కోట్ల మేర వసూలు చేయడం దారుణమని కవిత మండిపడ్డారు. రైతుల కష్టాలను తీర్చాల్సిన ప్రభుత్వం వారిపైనే ఆర్థిక భారం మోపడం సిగ్గుచేటని అన్నారు.

**-వ్యవసాయంపై సీఎం సమీక్ష కూడా లేదు**

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై కనీసం ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించలేదని కవిత విమర్శించారు. సాగునీరు, ఎరువులు, మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్లు వంటి కీలక అంశాలు సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడంలేదని ఆరోపించారు.

**-రైతు డిస్కంపై అనుమానాలు**

రైతు డిస్కం పేరుతో ప్రభుత్వం ఉచిత విద్యుత్ విధానాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని కవిత ఆరోపించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసే కుట్రలో భాగంగానే రైతు డిస్కం ప్రతిపాదన తెరపైకి వచ్చిందని అన్నారు. ఈ నిర్ణయాన్ని రైతులంతా వ్యతిరేకించాలని, తమ అభ్యంతరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.

**-వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి**

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగానికి పరిశ్రమల తరహాలో ప్రోత్సాహకాలు అందించాలని కవిత డిమాండ్ చేశారు. పారిశ్రామిక వేత్తలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, రుణాలు, సబ్సిడీలు రైతులకు కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చేందుకు సమగ్ర విధానంతో ముందుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు.

కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు అండగా నిలవాలి

రాష్ట్రంలో గణనీయమైన సంఖ్యలో ఉన్న కౌలు రైతులను అధికారికంగా గుర్తించి రైతు భరోసా పథకం వర్తింపజేయాలని కవిత డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని కోరారు.

బత్తాయి, నిమ్మ రైతుల

**-సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరం**

నల్గొండ జిల్లాలో బత్తాయి, నిమ్మ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ సౌకర్యాలు లేక రైతులు నష్టపోతున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తెలంగాణ రక్షణ సేన వారి తరఫున పోరాడుతుందని హామీ ఇచ్చారు.

**-పది కీలక తీర్మానాలకు ఆమోదం**

రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు డిస్కం రద్దు, రైతు భరోసా బకాయిల చెల్లింపు, కౌలు రైతులకు గుర్తింపు, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నకిలీ విత్తనాల నియంత్రణ, మూసీ కాలుష్య నివారణ, పత్తి, నిమ్మ, బత్తాయి రైతుల సమస్యల పరిష్కారం తదితర పది కీలక తీర్మానాలను ఆమోదించినట్లు కవిత వెల్లడించారు.

**-ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వానికి డిమాండ్**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం చేసేలా కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు.

## విధి నిర్వహణలో సమయం పాటించాలి..

- డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్





కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,జూన్ 11

నూతనంగా బాధ్యతలు చేపట్టిన హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి (డీఎంహెచ్ఓ) డా. పుట్ల శ్రీనివాస్ గురువారం ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన ఆయన, అల్ట్రాసౌండ్ యూనిట్, ఎక్స్‌రే విభాగం, ల్యాబ్, టీబీ యూనిట్, ఔషధ పంపిణీ కేంద్రం తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్ఓ పలు సూచనలు చేశారు. విధి నిర్వహణ సమయాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణులకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు పరీక్షలు, టీకాల కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజారోగ్య సేవల బలోపేతానికి ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా కేంద్రంలోని సౌకర్యాలు, సేవల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు అందించారు. ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై గర్వంగా నిలిచింది

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్





కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 11

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాలలో అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ ఈటల మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ పాలన భారత చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిందన్నారు. అత్యధిక కాలం విజయవంతంగా పాలన అందించిన నాయకుడిగా మోడీ దేశ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం అంటే కేవలం బడ్జెట్‌లు, పథకాలు మాత్రమే కాదని, దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, విశ్వాసాలను ప్రపంచానికి చాటి చెప్పే నాయకత్వం కూడా అవసరమని, ఆ బాధ్యతను మోడీ సమర్థవంతంగా నిర్వర్తించారని అన్నారు.
ఒకప్పుడు ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బందులు పడిన భారత్‌ను నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా తీర్చిదిద్దారని చెప్పారు. మూలధన వ్యయం గణనీయంగా పెరిగి దేశ మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించబడుతున్నాయని వివరించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి దేశ ప్రధానమంత్రి అయితే ప్రజల అవసరాలను ఎంతగా అర్థం చేసుకోగలడో మోడీ నిరూపించారని ఈటల పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కోట్లాది మరుగుదొడ్ల నిర్మించడం, పేదలకు కోట్ల సంఖ్యలో ఇళ్లు అందించడం, కరోనా సమయంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని అన్నారు. రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తూ వ్యవసాయానికి అండగా నిలుస్తోందన్నారు. ఎరువులపై భారీ సబ్సిడీలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని తెలిపారు. జాతీయ రహదారుల విస్తరణ, విమానాశ్రయాల పెంపు, తాగునీటి సరఫరా, సాగునీటి ప్రాజెక్టులు, హరిత ఇంధన రంగంలో పురోగతి వంటి అంశాల్లో దేశం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో భారత్ స్వదేశీ వ్యాక్సిన్‌ను తయారు చేసి దేశ ప్రజలతో పాటు ఇతర దేశాలకు కూడా అందించడం దేశ సామర్థ్యానికి నిదర్శనమన్నారు.
భారత్‌ను ప్రపంచ వేదికపై గౌరవనీయ స్థానంలో నిలబెట్టిన నాయకుడు నరేంద్ర మోడీ అని కొనియాడిన ఆయన, దేశ భద్రత, ఉగ్రవాద నిరోధం, రక్షణ రంగ స్వావలంబన, "మేక్ ఇన్ ఇండియా" వంటి కార్యక్రమాల ద్వారా దేశ ప్రతిష్ఠను మరింత పెంచారని అన్నారు.
తెలంగాణ అభివృద్ధికి కూడా భారతీయ జనతా పార్టీనే ప్రత్యామ్నాయమని పేర్కొన్న ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని చెప్పారు. గుజరాత్ తరహా అభివృద్ధిని తెలంగాణలో కూడా సాధించి చూపిస్తామని హామీ ఇచ్చారు.
ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాసేవలో 12 సంవత్సరాల మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మరింత ఆయురారోగ్యాలతో దేశ ప్రజలకు సేవలు అందించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ సేవెళ్ల మహేందర్ గౌడ్, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ డాక్టర్ సమత, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, గిరి వర్ధన్ రెడ్డి, పద్మయ్య, సుబ్బారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలు రద్దు చేయాలి
- అదనపు కలెక్టర్‌కు ఏఐవైఎఫ్ వినతి




కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 11

వరంగల్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వై.వి.గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా,ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలలు,కళాశాలలు,ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల యువతకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని,ప్రజా సేవల నాణ్యత దెబ్బతింటోందని అన్నారు.రాష్ట్రంలోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు టీజీపీఎస్సీ ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలని కోరారు.
ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని,ఉపాధ్యాయులు,అధ్యాపకులు,వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి,ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుదీర్,నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం.జి.నరేగా పథకాన్ని పునరుద్ధరించాలి

- రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపే కొత్త విధానాలను ఉపసంహరించాలి
- వి.బి.-జి. రామ్ జి పథకం రద్దు చేయాలి
- గ్రామీణ పేదల జీవన భద్రతకు 200 రోజుల ఉపాధి -- రూ.700 కూలి, రూ.6,000 పెన్షన్ ప్రకటించాలి"
- టిఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇంచార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు




కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 11

గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వి.బి.-జి. రామ్ జి పథకాన్ని వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.జి.నరేగా)ను యథాతథంగా పునరుద్ధరించి అమలు చేయాలని టిఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయనున్న కొత్త ఉపాధి పథకాన్ని వ్యవసాయ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగడం ఆందోళనకరమని వెంకటేశ్వర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమగ్రంగా చర్చించకుండా కొత్త పథకాన్ని అమలు చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు పూర్తయ్యే వరకు 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. కొత్త విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం, కేంద్రం 60 శాతం నిధులు భరించాల్సి రావడం వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఫలితంగా ఉపాధి హామీ కార్యక్రమం నిర్వీర్యమై గ్రామీణ కూలీల జీవనోపాధి సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త పథకాన్ని ఉపసంహరించుకొని, ఎం.జి.నరేగా పథకాన్ని పునరుద్ధరించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రంపై తక్షణమే ఒత్తిడి తీసుకురావాలని వెంకటేశ్వర్ రావు కోరారు. అదే విధంగా గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని విస్తరించి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ కూలీని రూ.700కు పెంచాలని, వృద్ధులు, నిరుపేదలకు నెలకు రూ.6,000 సామాజిక భద్రతా పెన్షన్ అందించాలన్నారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

**-జూన్ 23న జరిగే ధర్నాకు సంఘీభావం**

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమితి ఆధ్వర్యంలో జూన్ 23న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి వరంగల్-- హనుమకొండ టీఆర్ఎస్ ఇన్‌చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు సంఘీభావం ప్రకటించారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి 'టిఆర్ఎస్" పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.
6

## కామారెడ్డి జిల్లాలో మిస్సింగ్ కలకలం

### తల్లీ ముగ్గురు బిడ్డల అదృశ్యం

- గాలింపు చేపట్టిన పోలీస్ బృందాలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. గాంధీనగర్‌లో తల్లితో పాటు ముగ్గురు పిల్లలు కనిపించకుండా పోయారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. తల్లి లయ(31), కొడుకు శివ(13), ఇద్దరు కుమార్తెలు బిందు(16), దివిజ(08) ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజుల క్రితం బయటకు వెళ్లిన నలుగురు ఇంటికి తిరిగి రాలేదు. వారి కోసం వెతికినా ఆచూకీ లేకపోవడంతో కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీలు, ఫోన్ కాల్స్ వివరాలు పరిశీలిస్తున్నారు. నలుగురు ఒకేసారి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వీరి మిస్సింగ్‌కు కుటుంబకలహాలే కారణమని తెలుస్తోంది. గాంధీనగర్‌కు చెందిన లయ అనే మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పె÷-ళ్లైనప్పటి నుంచి భార్యాభర్తల మధ్య వివాదాలు ఉన్నప్పటికీ ఈ మధ్య కాలంలో మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇరు కుటుంబాల సభ్యులు పంచాయితీ నిర్వహించి.. ఇరువురూ కలిసుండేలా ఒప్పించారు. ఇందులో భాగంగా భార్యాభర్తలు, పిల్లలతో కలిసి గాంధీనగర్‌లో ఉంటున్నారు. మళ్లీ గొడవలు మొదటికి రావడంతో మనస్థాపం చెందిన లయ తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం పిల్లలను తీసుకుని బయటకు వెళ్లిన లయ తిరిగి రాకపోవడంతో.. భర్త, బంధువులు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.